# బుడ్డిగ రాధమ్మ కథ

ఆడ కళాసీల మస్తరు చూసినపుడు— "చంప, రాధ, పద్మ" లాటి చక్కటి పేర్లు పెట్టుకుంటారు యిక్కడి ఆడకూలీలు అని తెగ మెచ్చుకునేవారు కొండవాళ్ళ కల్చర్‌కి ముగ్ధులయి మావారు, వెంకమ్మ, పుల్లమ్మ, సుబ్బమ్మ సూరమ్మలాటి మన పేర్లకంటె చంప, పద్మ, రాధ, మాల — యిలాటి పేర్లు దేవతా స్త్రీల నామావళిలా చదువుకోడంలో ఆనందం వుండదూ? నదుల పేర్లూ నారీమణుల పేర్లూ అందంగా వుండే అరకులో కొన్నాళ్ళు వుండటమనేది మా అదృష్టమని నేననుకుంటాను.

అప్సరసల్నీ, దేవతా స్త్రీలనూ పిలిచినట్లు నదుల్ని అందమైన పేర్లతో పిల్చుకోవటం ముచ్చటగానే వుంటుంది. ఉత్తర మహేంద్ర తనయ, వంశధార, నాగావళి, గోస్తని, శారద, వరహా, తాండవ, చంపావతి ఇవి శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లోని కొన్ని నదుల పేర్లు.

అరకు లోయలోని కొండవాళ్ళ పేర్లు స్త్రీలని అందంగా వుండటం (ముఖ్యంగా మనవాళ్ళ కంటె మంచి పేర్లు పెట్టుకోవడం) నా కాశ్చర్యం వేసింది. వాళ్ళు బావుంటారు పచ్చగా- చూడ్డానికి కళ్ళకి నిండుగా అమాయకంగా ప్రకృతి సంతానంలా నిర్వికారంగా వుంటారు.

ప్రాజెక్టు పనుల్లో కొండవాళ్ళు ఆడా మగా అంతా కళాసీలుగా చేరేవారు. కళాసీకి రోజుకి రూపాయిన్నర, ఆడ కళాసీకి రూపాయి పావ

యిచ్చేవారు, కంట్రాక్టర్ల దగ్గర కూడా ఆడా మగా కూలీలు వందల కొద్దీ పనిచేసేవారు. ఇళ్లు, ఆఫీసు బిల్డింగులు, రైలుస్టేషన్లు ప్లాటుఫారాలు, వంతెనలు కట్టడానికి గవర్మెంటు తరపునా, కాంట్రాక్టర్ల తరపునా "కూలిజనం" పనిచేస్తూండేవారు. మనుషులు చాలకపోతే చాలా దూరం నుంచి రైళ్ళలో మందల్ని తోలుకొచ్చినట్లు తోలుకొచ్చి పనులు జరిగేచోట పాకలేసి వుంచే



వారు. కంట్రాక్టర్లు తెచ్చిన మనుష్యులమని ఎక్కువ, తిండి తక్కువ జులుం ఎక్కువ అయి అడవుల్లో రోగాలు పట్టుకుని దిక్కు మొక్కు లేకుండా నాశన మవుతూండేవారు. విరోచనాలు, కడుపునొప్పి, కలరా మలేరియా, పిలిస్తే పలికేవి. అడవిలో వాగుల్లోని నీళ్ళు తాగితే కొందరికి కీళ్ళ జ్వరాలు పట్టుకునేవి. కుటుంబాలకు కుటుంబాల మనుషులు అల్లానే అనారోగ్యంతో తీసుకుంటూ పనులుచేస్తూ నాగాలు పెడుతూ అవస్థలు పడేవాళ్ళు. పనిమానేసి వెళ్ళిపోవటానికి వారివద్ద డబ్బులుండేవికావు. కంట్రాక్టర్లు, లేబర్ తీసుకొచ్చేవారే కాని వారు మధ్యలో వెళ్ళిపోవాలంటే వారి

మానాన్న వారిని వదిలేసేవారు. కొండవాళ్ళు చాలా బద్ధకస్తులు. వాళ్ళకి పండుగలు, నృత్యాలు, తాగటం అంటే ఇష్టం. పనికిరారు, వచ్చినా సరిగా చేసేవారు కాదు.

కాలనీలో దొరల బంగళాలవద్ద కట్టెలుకొట్టి నీళ్ళుకాచి పాచిపనులు చేసి ఆడా మగా జీవిస్తూ వుండేవారు. వాళ్ళ అమాయకత్వం వాళ్ళ మంచి తనం కట్టు చాలా చిత్రంగా వుండేవి. సంతరోజు పెద్ద పెద్ద కొప్పులువేసి నూనె కారిపోయేలా తల దువ్వి రంగు రంగుల చీరలు ఎగగట్టి చంకన బిడ్డలతో, నెత్తిమీద తట్టలతో త్రాగేసి పాటలు పాడుకుంటూ నిశ్చింతగా దేవుని బిడ్డల్లా తిరిగేవారు. చింతపండు, కొండ చీపుళ్ళు, తెనె, ఆవాలు, పనసకాయలు తెచ్చి అమ్మి ఉప్పు, బియ్యం, కిరసనూనె కొనుక్కుపోయే వారు. ఆడ—మగ చిత్తుగా తాగేసి రాత్రల్లా డాన్సుచేస్తూ కాలక్షేపం చేసే వారు.

చిన్న చిన్న వంతెనలకు వుపయోగించే సిమెంటు పైపుల్ని చేసే వారు గడ్డదగ్గర. గడ్డ అంటే నీటివాగు- ఎవరూ తవ్వని కాలవ, చిరుత పులులు నీళ్ళ త్రాగడానికి అక్కడకు వస్తాయని చెప్పుకునేవారు, రైల్వే వాళ్ళు పైపుల్ని చేసేందుకు అక్కడ కాంక్రీటు మిక్చర్లని పని చేయిస్తూ వుండేవారు. ఈ కాంక్రీటు మిక్చర్లోకి తట్టలతో ఆడ కళాసీలు కాంక్రీటునీ సిమెంటునీ సున్నాన్ని ఎత్తి ఆ మిషన్‌లోకి పోసేవారు.

ఓ రోజున పని యెక్కువ కావాలని ఒక అసిస్టెంటు ఇంజనీరు వచ్చి ఐదుగంటల తర్వాత ఓవర్‌టైము చేయించమని చెప్పాడు. అప్పటికే కాంక్రీటు మిక్చర్‌కి పవర్ సప్లయిచేసే జనరేటర్ సరిగా పనిచేయటం లేదు. కాంక్రీటు మిషను చుట్టూ చితపతలాడుతూ తడి ఏర్పడింది. సన్నగా జల్లు ఆరంభమైంది. ఆడకళాసీలు దొరగారు పనిచేయమన్నారనేసరికి జడిసి ఐదుగంటల తర్వాత కూడా తట్టలతోతెచ్చి పోస్తూనే వున్నారు. జనరేటర్ నుంచి కాంక్రీటుమిక్చర్‌కి కలిసే కరెంటు తీగలలో ఎక్కడో దోషంవుంది.

బుడ్డిగ రాధమ్మ అనే పదహారు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తట్టతో సహా కరెంటు కొట్టి అక్కడి కక్కడే చచ్చిపోయింది. కూలీలు ఏడుపులా

అరుపులూ కేకలూ ప్రారంభించారు. చుట్టుప్రక్కల నుంచి జనం తండోప తండాలుగా రాసాగారు. పనిచేయించమన్న అసిస్టెంటు ఇంజనీరు జీపెక్కి పారిపోయాడు. పంజాబీ డాక్టరొచ్చి చచ్చిన రాధమ్మ నోట్లో నోరుపెట్టి గాలి పోయసాగాడు. రెండింజక్షన్లిచ్చి చచ్చిపోయింది. "డెత్ బై యాక్సి డెంట్" అని సర్టిఫికట్టిచ్చారు.

బుడ్డిగ రాధమ్మను పడుకోబెట్టి పూలదండలు వేశారు. ఆ అమ్మాయి అన్నగాడొకడు వచ్చి మా చెల్లిని చంపేశారంటూ గొడవచేశాడు. కొందరు అసిస్టెంటు ఇంజనీరుని పట్టుకుని తన్నాలని పరుగెత్తారు. అసి స్టెంటు ఇంజనీరు పెద్ద ఇంజనీరు గారింట్లో దాక్కున్నాడు. అక్కడ్నుంచే దొడ్డిదారిన అతడ్ని జీపు ఎక్కించి వైజాగ్ పంపేశారు. ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోవాలన్న కొండజాతి యువకు డొకడు ఓ వూరుని పొగు చేసు కొచ్చాడు. తగూ పెద్దదవుతోంది. దొరలంతా (ఇంజనీర్లు) వచ్చి సాను భూతి చెప్పారు. సర్కారువారినుంచి కాంపెన్సేషన్ (నష్టపరిహారం) వస్తుం దన్నారు.

ఆ రాత్రి ఎవరికీ నిద్దర్లులేవు కాలనీలో - మర్నాడు కొండ వాళ్ళు వచ్చి దొరల కాళ్ళమీదపడి గట్టిగా పట్టుకుని కదలనివ్వలేదు. రాధమ్మను గవర్మెంటు చంపేసింది అంటారు వాళ్ళు, ఆఫీసులన్నీ కొండ వాళ్ళు దాడి చేస్తారేమోననే భయంతో మూసేశారు. దొరలకి ఈ చిక్కు లోంచి బయటపడ్డం ఎలాగో తెలియలేదు. రైల్వే కంట్రాక్టర్ల పన్లన్నీ ఆగిపోయాయి.

అప్పుడొక డాక్టరన్నరు మరియు ఫ్యాన్ దొరలకు ధైర్యం చెప్పి సైకిలుమీద వెళ్ళి ఆ ఊరి హెడ్‌కానిస్టేబుల్ని పిలుచుకొచ్చాడు. హెడ్‌కాని స్టేబులు కొండవాళ్ళతో మాట్లాడి ఈ క్రింది నిర్ణయాలు తెలియజేశాడు.

రాధమ్మకి సిమెంటుతో తులసికోట కట్టి మంచి సమాది కట్టించాలి. రాధమ్మ శవాన్ని దొర్లంతా మోయాలి. పూలతో రాధమ్మ శవాన్ని అలంక రించాలి. కొండవాళ్లకి తాగుడు ఖర్చులక్రింద వంద రూపాయలు యివ్వాలి.

శవానికి భజన ఖర్చుల క్రింద ముప్పయి యివ్వాలి. కొండవాళ్ళకి రాధమ్మ దినవారాల ఖర్చులంతా దొరలే భరించాలి.

అన్నిటికీ దొరలు చకచకా ఒప్పేసుగున్నారు. పెళ్ళికాని చక్కని బుడ్డిగ రాధమ్మ శవం ఆఫీసువేపు తలపెట్టి పూరివేపు కాళ్ళుపెట్టి దొరల భుజాలమీద లేచి ఏటిఒడ్డుకు వెళ్ళింది. మెళ్ళో బంతిపూల దండలు మందార మాల వేసుకుని తాగి భజనచేస్తూ ఆమె ప్రియుడు శవం ముందు నృత్యం చేశాడు.

బుడ్డిగ రాధమ్మ కళాసీగా నెల జీతంమీద పనిలో చేరక ముందు మా ఇంట్లో పనిచేసేది. నేనే మా వారికి చెప్పి రాధమ్మకా ఉద్యోగం వేయించాను.